# నిగర్వి.. నిష్కామయోగి పి.రాజారావు

## రెవెన్యూ పెద్ద.. ఇనగాలి ముద్దుబిడ్డ పి.రాజారావు వర్ధంతి నేడు





నేల తల్లితో చెలిమి చేస్తూ ఉరకలెత్తే కట్టలేరు పరవళ్లు.. పంట పొలాల్లో గలగలా పారే జలసిరుల సవ్వడులు.. కనుచూపు మేర ఎటు చూసినా ఆకు పచ్చని అందాలు.. భూమాతకు పచ్చ కోక కట్టినట్టుగా ఉండే పొలాల మధ్య.. శతాబ్దాల చరిత్ర కలిగిన ఊరు ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ఇనగాలి. నీలి రంగు ఆకాశం దుప్పటి కప్పిం దా..? అన్నట్టుగా మనసును ఆకట్టుకునే ఆ ఊరి చైతన్యం అంతా ఇంతా కాదు.. నాడు నిజాం రజాకార్లను తరమి కొట్టిన వీర తెలంగాణ విప్లవ పోరాట స్ఫూర్తిని రగిలించిన పల్లెల్లో ఇదొకటి. ఏపీ, తెలంగాణకు దక్షిణ సరిహద్దుగా ఉన్న గ్రామం ఇనగాలి. దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన చారిత్రక ఆలయంలో స్వయంభూగా కొలువుదీరిన కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుడి గర్భ గుడికి కొద్ది కిలోమీటర్ల దూరంలోనే ఉన్న ఇనగాలిలో సరిగ్గా దేశ స్వాతంత్ర్యం రావడానికి నెలన్నర ముందు అంటే 1947 జూలై 02న ఇనగాలిలో అప్పుడే పుట్టిన మగశిశువును చూసిన తల్లిదం డ్రులు దీనమ్మ, లక్ష్మయ్య కండ్లల్లో ఏదో తెలియని ఆనందం. కానీ అదే కొడుకు ఇంతింతై వటుడింతై రెవెన్యూ శాఖలో వివిధ పదవులు అలంకరించి పదవులకే వన్నె తెస్తాడని ఆ తల్లి దండ్రులు ఊహించ లేదు. ఆయనే గతేడాది మార్చి 26న తీవ్రమైన గుండెపోటుతో కన్ను మూసిన రెవెన్యూ పెద్ద, ఇనగాలి గ్రామ ముద్దు బిడ్డ పొట్టపింజర రాజారావుగారు. ఆయన ఈ లోకాన్ని వదిలి అప్పుడే ఏడాది గడిచిం దా..? అనేలా రెవెన్యూ శాఖకు ఆయన చేసిన సేవలు నిత్యం ఆ శాఖ ఉద్యోగుల కండ్లల్లో కదలాడుతూనే ఉంటాయి. అంతలా తన సేవలను సార్ధకం చేసుకున్న రాజారావు గారి వర్దంతి సందర్భంగా ఓ మారు ఆయన సేవలను గుర్తు చేసు కోవాల్సిన అవసరం రెవె న్యూ కుటుంబ సభ్యులుగా మా అందరిపై ఉంది.

### ఆయన జీవితం విలువైన రెవెన్యూ పాఠం...

పొట్టపింజర రాజారావు గారు రెవెన్యూ శాఖకు చేసిన సేవ లను గుర్తు చేసు కుంటే ఆయన ఆధునికుల్లో ఆధునికుడు. రెవెన్యూ సంస్కరణలను స్వాగతించిన నేటి తరం మహా మనిషి. రెవెన్యూ సేవలో ఆదర్శప్రాయుడు. విధుల పట్ల విధేయత, ఉద్యోగాల్లో అలంకరించిన పదవులకు అలంకారంగా భాసిల్లిన ప్రతిభాశీలి రాజారావు గారు. ఏదైనా ప్రభుత్వానికి కీలకమైన శాఖగా కీర్తి గడించిన రెవెన్యూ శాఖలో విప్లవాత్మక మార్పులను కోరుకున్న మార్గదర్శి. డిప్యూటీ తహసీల్దార్ నుండి తహసీల్దార్, ఆర్‌డీఓ, డీఆర్‌ఓ, రెవెన్యూ శాఖకు ఉద్యోగ విరమణ అనంతరం కూడా అందించిన సేవలతో రెవెన్యూ శాఖలో నిగర్విగా, నిష్కామయోగిగా, రెవెన్యూ మేధావిగా తన జీవిత కాలంలో తనకంటూ ఒక చరిత్ర సృష్టించుకున్నారు. ఇంతటి మేధావులు కానరాని లోకాలకు వెళ్లిపోవడం మాకు అందరికీ తీరని లోటుగా భావిస్తున్నాం. రెవెన్యూ పెద్ద, ఇనగాలి గ్రామ ముద్దుబిడ్డ పొట్టపింజర రాజారావు గారు తన జీవితాంతం రెవెన్యూ శాఖ అభివృద్ధి కోసం కృషి చేశారు. ఆయన మనసులో మానవత్వం ఆయనకే సొంతం" ఇన్నో ఉద్యోగావకాశాలు తనను ఆహ్వానించినప్పటికీ, తన జీవితం ప్రత్యక్షంగా ప్రజల సేవలో నిమగ్నమవ్వాలనే మహోన్నత సంకల్పంతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రెవిన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రవేశించి, అనంతరం తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, జిల్లా రెవెన్యూ అధికారి వంటి కీలక హోదాలను అలంకరించడమే కాకుండా, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి బాధ్యతలను సమర్థంగా నిర్వహించి తన ప్రతిభను చాటుకున్నారు. తాను అనుకున్న స్థాయిని దాటి, మరింత విశాలమైన ప్రజాసేవను అందించి ప్రభుత్వ ప్రశంసలతో పాటు ప్రజల అపారమైన మన్ననలను సొంతం చేసుకున్నారు. సేవే ధర్మంగా భావించిన ఆయన, తన బాధ్యతల నిర్వహణలో ఎప్పుడూ అప్రమత్తత, నిబద్ధతకు ప్రతీకగా నిలిచారు. అత్యవసర పరిస్థితులలోనూ, విపత్కర సందర్భాలలోనూ ధైర్యంగా ముందుండి ప్రజలకు అండగా నిలిచి, బాధితులకు తక్షణ సహాయ సహకారాలు అందించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. సహజసిద్ధమైన ప్రశాంత స్వభావం, వినయశీలత, మర్యాదపూర్వక ప్రవర్తన, క్రమశిక్షణ, విధేయత ఆయన వ్యక్తిత్వాన్ని మరింత ఔన్నత్యపరచాయి. పనిపట్ల అపారమైన ఆసక్తి, నిబద్ధథ కలిగిన వ్యక్తిగా ప్రతి బాధ్యతను సమగ్రంగా, నిష్కళంకంగా నిర్వర్తించడం ఆయన జీవన విధానంగా మారింది. పేదరికం నుండి ఎదిగిన ఆయన, కుటుంబ పెద్దగా తన భుజాలపై పడిన బాధ్యతలను సార్థకం చేసుకుంటూ, తన భార్య రాజశ్రీ మణి సహకారంతో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లను సన్మార్గంలో నడిపించి వారికి బలమైన ఆధారంగా నిలిచారు. తన సంతానం అయిన కుమారుడు రాజేంద్ర ప్రసాద్, కుమార్తె విజయలక్ష్మిని ఉన్నత విద్యలనందించి, విలువలతో కూడిన ఆదర్శవంతులుగా తీర్చిదిద్దారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయన సేవా యజ్ఞం ఆగలేదు. ప్రభుత్వానికి, సమాజానికి వివిధ మార్గాలలో సేవలందిస్తూ, "రెవెన్యూ" మాసపత్రిక ద్వారా రైతులకు, ప్రజలకు, ఉద్యోగులకు తన అనుభవ జ్ఞానాన్ని పంచుతూ చివరి శ్వాస వరకు జ్ఞాన దీప్తిని వెలిగిం చారు. ఇలాంటి అరుదైన మహనీయుని కోల్పోవడం రాష్ట్ర రెవెన్యూ కుటుంబానికి తీరని లోటు. ఆయన సేవలను స్మరించు కుంటూ ప్రతి రోజూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ ఉంటారు. ఈ భువి నుండి పరమపదించినా, ఆయన జ్ఞాపకాలు మా హృదయాలలో చిరస్థాయిగా నిలిచాయి. పొట్టపింజర రాజారావు గారు భౌతికంగా మనమధ్య లేకున్నా ఆయన జ్ఞాపకాలు మనతోనే ఉంటాయి. వారికి కోడలు షీలా, మనుమలు ధనుష్, సిద్ధార్థ్ ఉన్నారు.



వ్యాసకర్త.. రమేష్ పాక, జనరల్ సెక్రెటరీ, టీజీటీప